క్లుప్తంగా

నేడు రైతువేదికలో రుణమాఫీ సంబరాలు

ఇచ్చోడ: రైతువేదికలో జరిగే రుణమాఫీ సంబరాలను విజయవంతం చేయాలని ఏవో జాదవ్ కైలాస్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీని లాంఛనంగా ప్రారంభించనున్న నేపథ్యంలో రైతువేదికలో కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. మండలంలోని 18 వందల మంది రైతులు రుణమాఫీ ద్వారా లబ్ధిపొందనున్నట్లు తెలిపారు.

బోథ్: ప్రభుత్వం రుణమాఫీ చేస్తున్న సందర్భంగా గురువారం సాయంత్రం 4 గంటలకు బోథ్‌లోని రైతు వేదికలో నిర్వహించే ప్రారంభోత్సవ కార్యక్రమానికి రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు తరలిరావాలని వ్యవసాయాధికారి భగత్ రమేశ్ ఒక ప్రకటనలో కోరారు.

'పీచు మిఠాయితో క్యాన్సర్'

బోథ్: పీచు మిఠాయితో ప్రమాదకరమైన రోగాలు వచ్చే ప్రమాదం ఉందని ఐహెచ్‌ఆర్‌వో జిల్లా ప్రధాన కార్యదర్శి బాషెట్టి రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం సొనాల గ్రామంలో ఓ వ్యక్తి పీచు మిఠాయి విక్రయిస్తుండగా ఆయనకు అవగాహన కల్పించి, అమ్మవద్దని సూచించారు. వీటిల్లో రోడమైన్ బి అనే రంగును కలపడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. ఇప్పటికే పాండిచ్చేరి, తమిళనాడు రాష్ట్రాల్లో రంగు పీచు మిఠాయిలు బ్యాన్ చేశారన్నారు. గ్రామాల్లో అమ్మకాలను నిషేధించాలని ప్రభుత్వాన్ని కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నార్నూర్: మండలంలో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన వారి కుటుంబాలను ఎమ్మెల్యే కోవ లక్ష్మి, తాజా మాజీ జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్‌లు పరామర్శించారు. హత్యకు గురైన నాగల్‌కొండ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు జాదవ్ గజేందర్, ఇటీవల విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన జాదవ్ హేమంత్ కుటుంబసభ్యులను వారు పరామర్శించారు. బీఆర్‌ఎస్ నాయకురాలు మార్సుకోలా సరస్వతి, ప్యాక్స్ చైర్మన్ ఆడే సురేశ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు జాదవ్ శ్రీరాం నాయక్, ఊర్వేత రూప్‌దేవ్, కనక ప్రభాకర్, సయ్యద్ ఖాసిం ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానిస్తున్న గ్రామస్తులు

జైనథ్: మండలంలోని పిప్పల్‌గావ్ ప్రాథమిక పాఠశాలలో 9ఏళ్లు పనిచేసి, ఇటీవలే బదిలీల్లో భాగంగా వేరే పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు శివన్న, వినోద్ కుమార్‌లను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ దిలీప్, ఇతర నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

'చరిత్ర తెలుసుకొని మాట్లాడాలి'

నేరడిగొండ: ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ చరిత్ర తెలుసుకొని మాట్లాడాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు ఏలేటి అశ్విన్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భువనగిరి ఎంపీపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. పారషూట్ లీడర్ భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ కాదని, ఆదిలాబాద్ ఎంపీ గొడం నగేశ్ అని అన్నారు. దాదాపు 20 సంవత్సరాల నుంచి ఒకే పార్టీలో ఉంటూ యూత్ కాంగ్రెస్ స్థాయి నుంచి ఎదిగి జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల ఇన్‌చార్జీగా చామల కిరణ్ పనిచేశారన్నారు. బీజేపీలోనే పారషూట్ లీడర్లు ఉన్నారన్నారు.

11వ రోజుకు చేరిన అంగన్‌వాడీల దీక్షలు



దీక్ష చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 10ని రద్దు చేయాలనే డిమాండ్‌తో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలేదీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం దీక్షలు 11వ రోజుకు చేరాయి. సర్కారు తీరును వ్యతిరేకిస్తూ అంగన్‌వాడీ ఆయాలు నిరసన వ్యక్తం చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌లో అన్యాయం చేసేలా ప్రభుత్వం జీవో జారీ చేయడం సరికాదన్నారు. తమ డిమాండ్‌లు నెరవేర్చే వరకు దీక్షలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

నిరుపయోగంగా వైకుంఠధామాలు

- శ్మశానవాటికల్లో వసతుల లేమి
- ఊరికి దూరంగా నిర్మించిన వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



జాముల్‌ధరిలోని వైకుంఠధామం

ఆదిలాబాద్‌రూరల్: గ్రామాల్లో ప్రభుత్వం నిర్మించిన వైకుంఠధామాలు నిరుపయోగంగా మారుతున్నాయి. పల్లెల్లో ఎవరైనా మరణిస్తే అంతిమ సంస్కారాలు చేసేందుకు చోటు లేక ఇబ్బందులు తలెత్తేవి. ఈక్రమంలో గత ప్రభుత్వం ప్రతీ గ్రామంలో వైకుంఠధామాలను నిర్మించింది. వాటిలో కొన్నింటిని ఊరికి దూరంగా నిర్మించడం.. మరి కొన్నింటి దగ్గరకు వెళ్లేందుకు సరైన రోడ్డు లేకపోవడం వంటి కారణాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వైకుంఠధామాలు నిర్మించిన ప్రభుత్వం నీటి వసతి, విద్యుత్ సౌకర్యం, గదులు వంటి మౌలిక వసతులు కల్పించలేదు. మండలంలో 34 గ్రామ పంచాయతీలు ఉండగా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.12.60 లక్షల వ్యయంతో, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పర్యవేక్షణలో రూ.10 లక్షల వ్యయంతో వైకుంఠధామాలు నిర్మించారు. వీటన్నింటికి మొత్తంగా రూ.4,10,20,000 వ్యయం చేశారు.

మౌలిక వసతులు కరువు

మండలంలో నిర్మించిన వైకుంఠధామాలను సద్వినియోగం చేసుకునేలా అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న విమర్శలు ఉన్నాయి. మండలంలోని 34 గ్రామాల్లో సగానికిపైగా శ్మశానవాటికలకు నీటి వసతి, విద్యుత్ సౌకర్యం లేదు. విద్యుత్ సౌకర్యం ఉన్న వాటికి వేలాది రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి నిర్మాణ సమయంలో ముందు చూపు కరువైందని, శ్మశానవాటికలకు వెళ్లే దారులు చిరుజల్లులకే చిత్తడిగా మారుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్నిచోట్ల గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో, మరికొన్ని చోట్ల చెరువుల్లో ఏర్పాటు చేయడం వల్ల అవి నిరుపయోగంగా మారుతున్నాయి. నిర్మాణాలు పూర్తయినప్పటికీ ఇంకా కొన్ని గ్రామాల్లో శిఖం భూములు, పంట పొలాలు, గ్రామ శివారులోని వాగుల్లో మృతదేహాల దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో కిలో మీటర్ల దూరంలో నిర్మించడం వల్ల అక్కడి వరకు వెళ్లలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించి వినియోగంలో కి తీసుకురావాలని మండలవాసులు కోరుతున్నారు.

> **పర్యవేక్షణ గ్రామ పంచాయతీలదే**
>
> మండలంలో మొత్తం 34 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతీ గ్రామపంచాయతీలో ఒకటి చొప్పున వైకుంఠధామాల నిర్మాణం జరిగింది. ఇందులో ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారుల పర్యవేక్షణలో ఏడు, పీఆర్ అధికారుల పర్యవేక్షణలో 27 వైకుంఠధామాల నిర్మాణం చేపట్టాం. వైకుంఠధామాల పర్యవేక్షణ బాధ్యత గ్రామ పంచాయతీలదే.
>
> – జాకీర్ హుస్సేన్, ఏపీవో, ఈజీఎస్, ఆదిలాబాద్

బోథ్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే అనిల్ జాదవ్



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్, డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి

తాంసి: బోథ్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్నానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం భీంపూర్ మండలంలోని అందర్‌బంద్‌లో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీకి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి మండలంలోని 24 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా గిరిజన ఆశ్రమోన్నత పాఠశాల ఆవరణలో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. గిరిజన పాఠశాలకు చెందిన విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. హనుమాన్ ఆలయం వద్ద రూ.5లక్షలతో నిర్మించే షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కరంజి(టి) అంతర్రాష్ట్ర రోడ్డు నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. పిప్పల్‌కోటి రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం అందే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. డిప్యూటీ తహసీల్దార్ హరీశ్, ఎంపీవో అహ్మద్, ఆర్ఐ శారద, ఈసీ నరేందర్, నాయకులు సంతోష్, సుధాకర్, చిట్యాల శంకర్, లింబాజీ, అనిల్, సంజీవ్ రెడ్డి పాల్గొన్నారు.

తలమడుగులో..

తలమడుగు: మొహర్రం పండుగ రోజు నూతనంగా నిర్మించిన సవారీ షెడ్డు ప్రారంభించడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని లింగి గ్రామంలో నూతనంగా నిర్మించిన సవారీ షెడ్డును ప్రారంభించారు. అనంతరం పీరీలను దర్శించుకున్నారు. గిరిగాం గ్రామానికి చెందిన డి. సమీక్షకు రూ.8000, పి.విద్యారాణికి రూ.5000ల సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టే కిరణ్ కుమార్, మండల కన్వీనర్ తోట వెంకటేష్, యువ నాయకులు పిడుగు అభిరాం రెడ్డి, మాజీ సర్పంచ్ పొచ్చన్న, గంగారమ్, ప్రకాశ్, నాయకులు పాల్గొన్నారు.

'ఆర్‌ఎంపీ, పీఎంపీలను గుర్తించడం హర్షనీయం'



మాట్లాడుతున్న అధ్యక్షుడు భీముడు

ఎదులాపురం: రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌ఎంపీ, పీఎంపీల సేవలను గుర్తించడం హర్షనీయమని ఆర్‌ఎంపీ, పీఎంపీల వెల్ఫేర్ అసోసియేషన్ సొసైటీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భీముడు, నర్సింలు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఓ పక్క ఆర్‌ఎంపీ, పీఎంపీలపై దాడులు జరుగుతుండగా సీఎం రేవంత్‌రెడ్డి ఆర్‌ఎంపీ, పీఎంపీలను గుర్తించడమే కాకుండా, శిక్షణ అందించి, సర్టిఫికెట్లు ఇవ్వాలని కలెక్టర్‌లను ఆదేశించడం శుభ పరిణామమన్నారు. సొసైటీ బాధ్యులు షాదిక్‌బాబా, విజయ్‌కుమార్, బిశ్వాస్, అడ్డ అనిల్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బాలికకు సన్మానం



సాత్వికను సన్మానిస్తున్న గ్రామస్తులు

తలమడుగు: అంతర్జాతీయ స్థాయిలో టార్గెట్ బాల్‌లో జట్టు తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం గెలిచిన జట్టులో కీలకపాత్ర వహించిన సాత్వికను కజ్జర్ల గ్రామస్తులు బుధవారం సన్మానించారు. నేపాల్ రాజధాని ఖాట్మండులో జరిగిన టార్గెట్ బాల్ పోటీలో పాల్గొని స్వగ్రామం కజ్జర్లకు చేరుకున్న ఆమెను స్వాగతించి అభినందించారు. బీఆర్‌ఎస్ బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్, సాత్విక తండ్రి మునిగంటి శ్రీనివాస్, అశోక్, ప్రమోద్, సుభాష్, సంతోష్, వెంకట్ రెడ్డి, సాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై తెగిపడిన విద్యుత్ తీగ



విద్యుత్‌తీగ చూపుతున్న యువకుడు

తాంసి: భీంపూర్ మండలం అంతర్గాం–ఇందూర్‌పల్లి గ్రామాల మధ్య అంతర్రాష్ట్ర రోడ్డుపై బుధవారం 11 కేవీ విద్యుత్‌తీగ తెగి పడింది. విద్యుత్‌తీగ తెగిపోయి రోడ్డుపై పడి ఉండగా గమనించిన యువకుడు కపిల్ వాహనదారులను అప్రమత్తం చేశాడు. విద్యుత్‌తీగ రోడ్డుపై పడి ఉందని వాహనదారులు గమనించకుండా వెళ్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని అక్కడే ఉండి వాహనదారులకు తెలియజేసి విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాడు.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌ను కలిసిన అరుణ్ కుమార్



చైర్‌పర్సన్ శారదతో అరుణ్‌కుమార్

బోథ్: తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా బుధవారం హైదరాబాద్‌లోని బుద్ధవిహార్‌లో బాధ్యతలు చేపట్టిన నేరెళ్ల శారదను ఏఐసీసీ విచార్ విభాగ్ తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. అరుణ్‌తో పాటు తెలంగాణ రాష్ట్ర పీసీసీ ఎన్‌ఆర్‌ఐ విభాగం కన్వీనర్ మంద భీంరెడ్డి ఉన్నారు.

శిథిలావస్థలో పాఠశాల భవనం



శిథిలావస్థలో ఖంపూర్ చిత్తగూడ గ్రామ పాఠశాల భవనం



నత్తనడకన సాగుతున్న అదనపు భవన నిర్మాణ పనులు

నార్నూర్: మండలంలోని ఖంపూర్ చిత్తగూడ గ్రామంలోని ఐటీడీఏ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. పాఠశాల ఆవరణ చుట్టూ పిచ్చి మొక్కలతో పాటు గడ్డి పెరిగి ప్రమాదం పొంచి ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మరుగుదొడ్లు కూడా నిరుపయోగంగా మారడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఒంటికి, రెంటికి విద్యార్థులు ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గత ప్రభుత్వం మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా అదనపు తరగతి గదులను మంజూరు చేసింది. కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. అసలే వర్షాకాలం పాత భవనం శిథిలావస్థకు చేరడం.. భవనం పైకప్పు కిందకు వంగి ఉండడంతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా ఏకాదశి పూజలు



ఇంద్రవెల్లి: భీంనగర్ విఠలేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ఇచ్చోడ: పాదయాత్రగా విఠలేశ్వర ఆలయానికి వస్తున్న భక్తులు



నేరడిగొండ: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



బజార్‌హత్నూర్: పూజలు చేస్తున్న ఎంపీ నగేశ్

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని ముత్నూర్, దనోరా.బి గ్రామాల్లో బుధవారం తొలి ఏకాదశి పూజలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని భీంనగర్, మండలంలోని దనోరా.బి గ్రామాల్లోని భక్తులు ఉపవాస దీక్షలతో విఠలేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఇచ్చోడలో..

ఇచ్చోడ: మండల వ్యాప్తంగా బుధవారం తొలిఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో విఠలేశ్వర ఆలయానికి ఉదయం 8 గంటల నుంచే భక్తుల తాకిడి మొదలైంది. సాయంత్రం 4 గంటల వరకు విఠలేశ్వరుడిని దర్శించుకునేందుకు భక్తులు బారులుదీరారు. పలు గ్రామాల నుంచి భక్తులు పాదయాత్రగా వచ్చి విఠలేశ్వరుడిని దర్శించుకున్నారు. మండల కేంద్రంతో పాటు సర్సాపూర్‌లో ఉన్న విఠలేశ్వర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఎమ్మెల్యే పూజలు

నేరడిగొండ: తొలి ఏకాదశి సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయంతో పాటు శివాలయాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట వీడీసీ చైర్మన్ రవీందర్ రెడ్డి ఉన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

బోథ్: మండల వ్యాప్తంగా తొలి ఏకాదశి వేడుకలను ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే మండలంలోని గ్రామాల్లో ఆలయాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోథ్‌లోని శ్రీ భక్త మార్కండేయ, హనుమాన్, విఠలేశ్వర ఆలయం, సొనాలలోని రామాలయంలో భక్తులు పూజలు నిర్వహించారు.

బజార్‌హత్నూర్: హిందువుల మొదటి పండుగ తొలి ఏకాదశి సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బజార్‌హత్నూర్‌లోని విఠలేశ్వరాలయం, దత్తాత్రేయాలయం, జాతర్లలోని శ్రీవేంకటేశ్వరాలయం, భూతాయి(బి)లోని రామాలయం భక్తులతో కిటకిలాడాయి. జాతర్లలో శ్రీవేంకటేశ్వరాలయంలో ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గొడం నగేశ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గుడిహత్నూర్: మండలంలో ఆలయాలు హరినామ స్మరణతో మారుమోగాయి. ఆయా గ్రామాల్లో తొలి ఏకాదశిని బుధవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టి మండల కేంద్రంలో ఉన్న విఠల రుక్మిణి ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలో లింగాపూర్ గ్రామస్తుల ఆధ్వర్యంలో నగర సంకీర్తన నిర్వహించారు. గుడిహత్నూర్ సహకార సంఘం చైర్మన్ సంజీవ్ ముండే, వామన్ పటేల్, శ్రీరాం లాండాడే, రావణ్ ముండే, కుంట నారాయణ, మారుతి ధన్నురే, శివాజీ తదితరులు పాల్గొని భక్తుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను పర్యవేక్షించారు.

ఘనంగా విఠలేశ్వరుని కల్యాణమహోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

జైనథ్: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో రుక్మిణీ సమేతుడైన శ్రీ విఠలేశ్వరుని కల్యాణోత్సవాన్ని గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు గావించారు. రుక్మిణీ, విఠలేశ్వరుని విగ్రహాలను నూతన వస్త్రాలను అలంకరించి, అభిషేకాలు గావించారు. అనంతరం వేద మంత్రాలు, భాజాభజంత్రీల నడుమ కల్యాణం జరిపించారు. కాగా ఏటా తొలి ఏకాదశి సందర్భంగా ఆలయంలో కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

నేడు మహాన్నదానం..

విఠలేశ్వరుని ఆలయంలో భక్తుల కోసం గురువారం మహాన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తొలి ఏకాదశి సందర్భంగా ఉపావాస దీక్షలు ఆచరించిన భక్తులు గురువారం ఆలయంలో పూజలు చేసి, ఉపవాస దీక్షలు విరమించవచ్చన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఊరూరా పీరీల సందడి



ఇంద్రవెల్లి: శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని గొండ్‌గూడ, వాల్గొండ, వడగామ్, భగత్‌సింగ్ నగర్, అంజీ, ముత్నూర్, దనో రా.బి, తుమ్మగూడ, దొబిగూడ, పిప్రి, గట్టెపల్లి తదితర గ్రామాల్లో మొహర్రం ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఆయా గ్రామాల్లో పీరీలు, డోలలతో శోభాయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా యువకులు చేసిన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి.

బజార్‌హత్నూర్: మండలంలోని పిప్రి, గిర్నూర్, వర్తమన్నూర్, బజార్‌హత్నూర్, దేగామ, జాతర్ల, చింతలసాంగ్వీ, మోర్కండి గ్రామాల్లో బుధవారం మొహర్రం వేడుకలను హిందు, ముస్లింలు ఘనంగా నిర్వహించారు. సావర్లకు భక్తులు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కోలాటం, దూల, నృత్యాలతో ఉల్లాసంగా వేడుకలు జరిపారు.

బురదమయంగా ధన్నూర్ వంతెన



బోథ్: మండలంలోని ధన్నూర్ బి గ్రామానికి ఆనుకొని ఉన్న వంతెన బురదమయంగా మా రింది. కురిసిన భారీ వర్షానికి వంతెన పైన చెట్ల కొమ్మలు, బురద వచ్చి చేరాయి. దీంతో బుధవారం గ్రామస్తులు వంతెన దాటడానికి ఇబ్బందులు పడ్డారు. వీలైనంత త్వరగా నూతన వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నా రు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత



బాధితుడికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్సై విష్ణువర్ధన్

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన నసీమ్ ఈనెల 14న తన మొబైల్‌ఫోన్ పోగొట్టుకొని మావల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సెల్‌ఫోన్‌ను ట్రేస్ చేసి పోలీసులు గుర్తించి బుధవారం బాధితుడికి అందజేసినట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు.